

గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

నిరీక్షణ

- కార్మికుల కోసం 12 రోజులుగా కొనసాగుతున్న అన్వేషణ
- టన్నెల్‌లో అడుగడుగునా అవాంతరాలు
- నిరాశతో స్వస్థలాలకు బయలుదేరుతున్న బాధిత కుటుంబీకులు
- ప్రమాద ఘటనా స్థలాన్ని గుర్తించేందుకు ఎన్‌జీఆర్‌ఐ, ఎన్‌ఆర్‌ఎస్‌సీ బృందాలు
- భూమి నైసర్గిక స్వరూపాన్ని అంచనా వేసేందుకు కొనసాగుతున్న సర్వే



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని బోరింగ్ మిషన్ విడిభాగాలు

నాగర్‌కర్నూల్/దోమలపెంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన సంఘటన నేటికి 12 రోజులవుతోంది. గత నెల 22న సొరంగం కూలిన సంఘటనలో ఇద్దరు ఇంజనీర్లు, మరో ఇద్దరు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికుల ఆచూకీ లేకుండాపోయిన విషయం తెలిసిందే. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఇన్‌లెట్ వైపు 14వ కిలోమీటరు వద్ద ఈ దుర్ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో మొత్తం 54 మంది సొరంగం తవ్వకం పనులకు వెళ్లగా టన్నెల్ బోరింగ్ మిషన్ వెనుకభాగంలో పని చేస్తున్న 46 మంది ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. 8 మంది టీబీఎం కింద కొందరు, ముందు భాగంలో మరి కొందరు చిక్కుకున్నారు. 12 రోజులుగా టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, హైడ్రా, సింగరేణి కార్మికులు దాదాపు 703 మంది నిరంతరం శ్రమిస్తున్నా ఆచూకీ దొరకడం లేదు. సంఘటనా స్థలంలో దాదాపు 5 వేల మెట్రిక్ టన్నుల మట్టి ఉందని అధికారుల బృందం నిర్ధారించింది. కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ ప్రక్రియ ప్రారంభించేందుకు దాదాపు 11 రోజుల సమయం పట్టింది. ఈ లోపు లోకో ట్రైన్ ద్వారా మట్టి గ్యాస్ కట్టర్‌ల ద్వారా తొలగించిన టీబీఎం విడిభాగాలు శిథిలాలను తొలగించే ప్రయత్నం చేసినా ఈ అంశం నామమాత్రంగానే సాధ్యమైంది. మూడు రోజుల క్రితం టన్నెల్‌ను సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రెస్క్యూ టీం బృందం సమగ్రంగా వివరించింది. లోకో ట్రైన్ ద్వారా మట్టి తొలగింపు త్వరితగతిన పూర్తి కాగా ఇందుకు చాలా సమయం పడుతుందని తెలియజేశారు. ఎంత ఖర్చు అయినా వెనుకాడేది లేదని, అంతర్జాతీయ పరిజ్ఞానాన్ని



సొరంగంలో పేరుకుపోయిన బురద

(మిగతా 6లో..)



ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని బోరింగ్ మిషన్ నమూనాను పరిశీలిస్తున్న కలెక్టర్



సొరంగంలో పేరుకుపోయిన బురదను తొలగిస్తున్న రెస్క్యూ బృందాలు



బయటికి తెచ్చిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని విడిభాగాలు

ఇంటర్ పరీక్షలు మొదటి రోజు..

ప్రశాంతం

నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల సర్కిల్/వనపర్తిరూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం 8 గంటల 45 నిమిషాల తర్వాత పరీక్ష హాలులోకి అనుమతించలేదు. ఇంటర్ ప్రథమ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 6,817 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6,449 మంది హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 5,172 మందికి గాను 4,924 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,645 మంది హాజరు కావాల్సి ఉండగా 1,525 మంది హాజరయ్యారు. అదేవిధంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో తొలిరోజు జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 96.34శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 4,235 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,080 మంది హాజరైనట్లు ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు తెలిపారు. జనరల్ విద్యార్థులు 3,415 మంది హాజరుకావాల్సి ఉండగా 3,304 మంది హాజరు. ఒకేషనల్ 820మంది విద్యార్థులకు గాను 776 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. వనపర్తి జిల్లాలో మొత్తం 6,714 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 6,476 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను ఎప్పటికప్పుడు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య తనిఖీ చేశారు. మొదటిరోజు మూడు జిల్లాల్లో మాల్‌ప్రాక్టిసింగ్ కేసు నమోదు కాలేదు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్ విధించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి వేయించారు.




వనపర్తి పట్టణంలోని పరీక్ష కేంద్రానికి పరుగున వస్తున్న విద్యార్థి



గద్వాల పట్టణంలో ఓ పరీక్ష కేంద్రం వద్ద నోటీస్ బోర్డుపై హాల్ టికెట్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



వనపర్తి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను చెక్ చేస్తున్న అధికారులు



వనపర్తిలో 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం ప్రారంభంతో ఎండల తీవ్రత పెరిగింది. బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటల నుండే ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఇళ్ల నుంచి బయటికి రావాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఉండాల్సిన ఎండ తీవ్రత మార్చి మొదటి వారంలోనే ఉండటంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. బుధవారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని దగడపల్లి గ్రామంలో 39.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.9 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 20.8 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 38, కనిష్ఠం. 23.1, నారాయణపేట జిల్లాలో 37 డిగ్రీల గరిష్ఠం, 31 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాగర్‌కర్నూలు జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు నమోదు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 20 డిగ్రీలు నమోదైంది.

లక్ష్యం చేరుకోవాలి

- ఇందిరా మహిళా శక్తి పథకం సమీక్షలో కలెక్టర్ ఆదర్శ్ సురభి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకంలోని 16 రకాల యూనిట్ల మంజూరు చేసి వందశాతం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో మహిళా శక్తి పథకం యూనిట్ల లక్ష్యం, బ్యాంకు లింకేజీ రుణాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. యూనిట్ల గ్రౌండింగ్ 100 శాతం పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరుల లోపు ఇందిరా మహిళా శక్తి పథకం లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో ఉమాదేవి, డీపీఎం భాషా నాయక్, ఏపీఎం సాయి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి

- ఆర్‌సీఎస్ కమిషనర్ సురేందర్‌మోహన్



మాట్లాడుతున్న ఆర్‌సీఎస్ కమిషనర్ సురేందర్ మోహన్

తెలకపల్లి/ఉప్పునుంతల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని అందరూ కలిసి అభివృద్ధి చేసుకోవాలని ఆర్‌సీఎస్(రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీ) కమిషనర్ సురేందర్ మోహన్ ఐఏఎస్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి ఉప్పునుంతల వ్యవసాయ సహకార సంఘ కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితో సంఘం అభివృద్ధి చెందిందని, భవిష్యత్తులో రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉప్పునుంతల సొసైటీని ఆదర్శంగా నిలిపినందుకు పాలక వర్గాన్ని అభినదించారు. సొసైటీ ద్వారా రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలతో పాటు ఇతర రుణాలు ఇవ్వడం, రికవరీ గురించి తెలుసుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకే ఆదర్శం కాదు రాబోయే రోజులలో రాష్ట్రానికి ఉప్పునుంతల సొసైటీ ఆదర్శంగా ఉండాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బెస్టు సొసైటీలను తనిఖీ చేసి అక్కడ అనుసరిస్తున్న విధానాలు వెనక బడిన సొసైటీల బలోపేతానికి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, డీఎం మార్క్‌ఫెడ్ నర్సింహ్మారావు, డిప్యూటీ మార్కెట్ డైరెక్టర్ ప్రసాద్‌రావు తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా పశుబల ప్రదర్శన

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విజయుడు
- రాజోలిలో కొనసాగుతున్న రైతు సంబురాలు

7

రాష్ట్రపతి భవన్‌లో గద్వాల చేనేత చీరల ప్రదర్శన

6



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) 6:29

సహెర్ (శుక్రవారం) 5:08



ట్రైనీ ఎస్ఐ తేజస్వినితో వాగ్వాదం చేస్తున్న రైతులు



కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న రైతులు

పంటలు ఎండుతున్నాయ్..

- సాగునీరు ఇవ్వాలని రైతుల ధర్నా

గద్వాల న్యూటౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయని కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని కొండాపురం, ఈర్లబండ, వెంకటాపురం, ఇర్కిచేడు, గువ్వలదిన్నె, గంగన్‌పల్లి రైతులు బుధవారం గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ర్యాలంపాడు రిజర్వాయర్ 104 ప్యాకేజి కింద దాదాపు 2 వేల ఎకరాల్లో పంటలు సాగుచేశామని, సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయని వాపోయారు. వరి చివరిదశలో ఉందని, ఇప్పటికే దాదాపు 200 ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కెనాల్‌పైన అక్రమ మోటర్లు ఉండటంతో చివరి ఆయకట్టు గ్రామాలకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. అధికారులు స్పందించి అక్రమ మోటార్లకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. మధ్నాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ధర్నా చేశారు. ట్రైనీ ఎస్ఐ తేజస్విని, అదనపు కలెక్టర్‌ను కలవాలని చెబుతున్నా వినకుండా కలెక్టర్ రావాలని డిమాండ్ చేశారు. 6:30 గంటలకు అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వారి సమస్యలు వివరించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో రైతులు రాజేష్, పద్మారెడ్డి, రాజ్‌కుమార్, తిమ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, రంగస్వామి, రంగప్ప, యుగంధర్, సంజీవులు తదితరులు ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజువర్

- దరఖాస్తులను పరిశీలించిన అధికారులు
- 25 శాతం రాయితీతో మార్చి 31 గడువు
- భూముల విలువపై ఎల్‌ఆర్‌ఎస్ చార్జీ
- మాట మార్చిన ప్రభుత్వంపై ప్లాట్ల యజమానుల ఆగ్రహం

అక్రమంగా వెలసిన లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులకు ఎల్‌ఆర్‌ఎస్ వణుకుపుట్టిస్తోంది. గత ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్ తీసుకొచ్చింది. అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వెయ్యి రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. వనపర్తి జిల్లాలోని 5 మునిసిపాలిటీల్లో 47,971 మంది దరఖాస్తు చేసుకున్నారు.

6

- కొత్తకోట, ఆంధ్రజ్యోతి



కొత్తకోట బైపాస్ సమీపంలో ఏర్పాటు చేసిన లే అవుట్

నష్టపరిహారం చెల్లించాలి

- కేఎల్ఐ కాల్వ పనులను అడ్డుకున్న రైతులు
- రెండేళ్లుగా పరిహారం చెల్లించని ప్రభుత్వం

6



తాడూరు సమీపంలోని కేఎల్ఐ కాల్వ పనులను అడ్డుకున్న రైతులు

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరం మోడల్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఫిరంగి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 5, 6, 7వ తరగతి చదువుతున్న గిరిజన బాల బాలికలు ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 12 నుంచి 16 వరకు అచ్చంపేట ఎన్‌టీఆర్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అదేవిధంగా తుది ఎంపికలు రాష్ట్రస్థాయిలో ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాదులో ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన జిల్లాలోని గిరిజన బాల బాలికలు వారి కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, బోనఫైడ్, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో ఈ నెల 10న సా యంత్రం 5 గంటల లోపు జిల్లా గిరిజన సంక్షే మశాఖ కార్యాలయంలో దరఖాస్తు అందజే యాలని ఆయన సూచించారు.

శానిటేషన్ పద్ధతులు బాగున్నాయి

» సీడీవో హేమలత » ముగిసిన రెండురోజుల శిక్షణ


శానిటేషన్ పద్ధతులను వివరిస్తున్న సీడీవో హేమలత

మహబూబ్‌నగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు నగరపాలక సంస్థలో శానిటేషన్ కోసం తీసుకుంటున్న పద్ధతులు బాగున్నాయని సీడీఎంఏ నుంచి వచ్చిన కంపోస్టు డెవలప్‌మెంట్ ఆఫీసర్ హేమలత కొనియాడారు.

కార్పొరేషన్ పరిధిలో రెండురోజులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన మునిసిపాలిటీల కమిషనర్లు, అధికారులకు ఇస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా హాజరైన కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లకు పాలమూరు నగర పాలక సంస్థలో చేపడుతున్న వర్మీ కంపోస్ట్, విండ్రో కంపోస్ట్, తడి, పొడి చెత్త విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని మునిసిపాలిటీల్లో తడి, పొడి చెత్త సేకరణ ప్రణాళికా బద్ధంగా చేపడితే 100 శాతం అమలవుతుందన్నారు. ఎస్‌హెచ్‌జీ, సీఈఈ నిర్వహించు పొడి వనరుల సేకరణ కేంద్రాలను, విండ్రో కంపోస్టింగ్, వర్మీ కంపోస్టింగ్ చేసే పద్ధతిని దశలవారీగా ఏ విధంగా నిర్వహించాలో వివరించారు. పాలమూరులో డీఆర్‌సీసీ, విండ్రో కంపోస్టింగ్, వర్మి కంపోస్టింగ్ విధానాలు మెరుగ్గా అమలు చేస్తున్నారని, మిగతా మునిసిపాలిటీల్లో కూడా ఈ విధానాలను అమలయ్యేలా చూడాలని కోరారు. కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నిరీక్షణ

» కార్మికుల కోసం12 రోజులుగా కొనసాగుతున్న అన్వేషణ
» టన్నెల్‌లో అడుగడుగునా అవాంతరాలు
» నిరాశతో స్వస్థలాలకు బయలుదేరుతున్న బాధిత కుటుంబీకులు

(5వ పేజీ తరువాయి...)

వినియోగించుకుని సాధ్యమైనంత త్వరలో కార్మికుల ఆచూకీ కనుగొనాలని సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ ప్రక్రియ మంగళవారం పూర్తయినప్పటికీ అది పూర్తి స్థాయిలో పని చేయలేదు. దీంతో రెస్క్యూ ఆపరేషన్‌కు మళ్లీ ఆటంకం ఏర్పడింది. మూడు సిఫ్టుల్లో నిరంతరం పనులు జరుగుతున్నా లోపల ఉన్న మట్టిని బయటికి పంపించే ప్రత్యామ్నాయ వ్యవస్థ లేకపోవడం ప్రధాన అవరోధంగా మారింది. ఈ నేపథ్యంలో సహాయ చర్యలను వేగంతం చేసేందుకు ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ నుంచి సిస్మాలజీ విభాగం నిపుణులను పిలిపించారు. ఇక్కడ భూమి స్వభావం, మట్టి తీస్తే ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటుందా అనే అంశం ఈ బృందం అధ్యాయనం చేయనుంది.

ఇదిలా ఉండగా టన్నెల్‌లో జరుగుతున్న సహాయక చర్యలపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ ఉన్నతాధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బార్డర్ రోడ్డు ఆర్గనైజేషన్ కర్నల్ మెహ్రా టన్నెల్ బోరింగ్ మిషన్ నమూనాతో ఈ సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. గ్రౌండ్ పెనిటేటింగ్ రాడార్ గుర్తించిన సర్ఫేస్ డిస్టర్బింగ్ ప్రాంతాలలో మట్టి తీసే ప్రక్రియను కొనసాగిస్తున్నామని టన్నెల్ బోరింగ్ మిషన్ ఎడమ వైపు వాటర్ జెట్‌ల ద్వారా బురద తొలగించే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రోబోటిక్ సేవల వినియోగం ద్వారా ఏదైనా ప్రయోజనం ఉంటుందా అనే కోణంలో ప్రభుత్వం ఆలోచిస్తుందని మెహ్రా పేర్కొన్నారు. ఈ క్రమంలో హైదరాబాదుకు చెందిన రోబోటిక్ టెక్నాలజీకి చెందిన సంస్థ ఎన్‌వీ రోబోటిక్ ప్రత్యేక బృందం బుధవారం మధ్యాహ్నం ఎస్ఎల్‌బీసీని సందర్శించిందని ఆయన చెప్పారు.


టన్నెల్ వద్ద సహాయక సిబ్బంది

అయితే తమ బంధువుల ఆచూకీ కోసం 12 రోజులుగా నిరీక్షిస్తున్న వారు నిరాశతో తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో జమ్మూకశ్మీర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బిహార్‌లకు చెందిన కార్మికులు ఆచూకీ లేకుండా పోయిన విషయం తెలిసిందే.

సాంకేతికతకు అంతుచిక్కని సమస్య?

» ఎస్ఎల్‌బీసీ సొరంగంలో శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అధికారుల విశ్వ ప్రయత్నం
» ప్రమాద ఘటనా స్థలాన్ని గుర్తించేందుకు అటవీ ప్రాంతంలో ఎన్‌జీఆర్ఐ, ఎన్ఆర్ఎస్‌సీ బృందాలు

దోమలపెంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) శ్రీశైలం ఎడమగట్టు సొరంగం ప్రమాదంలో శిథిలాల కింద చిక్కుకున్న ఆ 8మందిని గుర్తించేందుకు గత 12 రోజులుగా దేశ, విదేశాల్లో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 12 రెస్క్యూ బృందాలు నిరంతరాయంగా పనులు చేస్తున్నారు. జీపీఆర్, సిస్మా రోబోటిక్ తదితర సంస్థల బృందాలు స్కానింగ్ చేసి కొన్ని ప్రాంతాలను గుర్తించి తవ్వకాలు చేపడుతున్నా సొరంగంలో చిక్కుకున్న వారిని గుర్తించే ఆనవాలు కన్పించక పోవడంతో సాంకేతిక పరిజ్ఞానానికి సవాలుగా మారిందని నిపుణులు చర్చించుకుంటున్నారు. మట్టి దిబ్బల కింద చిక్కుకున్న వారి జాడ కనిపెట్టడం కష్ట సాధ్యం కావడంతో ఈ సమస్య వివిధ సాంకేతిక సర్వే బృందాలకు, ప్రభుత్వానికి సవాలుగా మారింది. సొరంగంలో శిథిలాల కింద చిక్కుకున్న వారు ప్రాణాలతో వస్తారని కుటుంబ సభ్యులకు నమ్మకం సన్నగిల్లినప్పటికీ వారి మృతదేహాలను చూపిస్తారన్న ఆశతో కుటుంబ సభ్యులు నిరీక్షిస్తున్నారు.

నల్లమలలో కొనసాగుతున్న ఎన్‌జీఆర్ఐ, ఎన్ఆర్ఎస్‌సీ సర్వే

సొరంగంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలో భూమిపైభాగంలో 13.9 కిలో మీటర్ల ప్రదేశం అమ్రాబాద్ అభయారణ్యం దోమలపెంట రేంజ్ పరిధిలోని తాటిగుండా సెక్షన్ 199 కంపార్ట్‌మెంట్‌లో ఉన్నది. టేకుల సొరువ, కుడితి పెంట ప్రాంతాల్లో కాలువలు, లోయలు, ఎత్తైన కొండలు ఉన్నాయి. భూమిపైభాగం నుంచి 469 మీటర్ల లోతులో సొరంగ ప్రమాదం జరిగింది. ఎన్‌జీఆర్ఐ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) సర్వే బృందాలు గుర్తించాయి. వారం రోజులుగా ఈ బృం దాలు సర్వే చేస్తుండగా బుధవారం అటవీ శాఖ సహకారంతో మరి కొన్ని ప్రాంతాలను ఎంపిక చేశారు. ఇక ముందు సొరంగం పనులు చేపడితే ఏర్పడే సమస్యలు, ప్రమాదాలను అంచనా వేసేందుకు భూమి అంతర్భాగంలో నైసర్గికాని గుర్తించేందకు సర్వే కొనసాగిస్తున్నామని సర్వే బృందాల సభ్యులు పేర్కొంటున్నారు. పూర్తి అధ్యయన నివేదికను సర్వే సంస్థల ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు పేర్కొన్నారు.


నల్లమల అభయారణ్యం కుడితి వాగు ప్రాంతంలో సర్వే చేస్తున్న ఎన్‌జీఆర్ఐ, ఎన్ఆర్ఎస్‌సీ బృందాలు

ప్లాట్లు కొనేవారే కరువయ్యారు



జడ్చర్ల పట్టణంతో పాటు పరిసర ప్రాంతంలోని వెంచర్‌లలో ప్లాట్లు కొనే వాళ్లే కరువయ్యారు. ప్లాట్లు అమ్ముడుపోవడం లేదు. 10 సంవత్సరాల అనంతరం ఉండాల్సిన ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో ఉండటం ఒక కారణం. ఇటీవల కాలంలో ప్లాట్లు కబ్జాలకు గురికావడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి జడ్చర్లలో ప్లాట్లు కొనుగోలు చేసేవారంతా కొనుగోలుకు విముఖత చూపిస్తున్నారు. ప్రతి పల్లె ప్రాంతానికి సమీపంలో వెంచర్‌లు ఏర్పాటు చేయడంతో అక్కడే కొనుగోలు చేసేందుకు గ్రామాల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

- జనార్దన్‌రెడ్డి, రియల్ ఎస్టేట్ వ్యాపారి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కేంద్ర బిందువుగా ఉన్న జడ్చర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారం స్తబ్దుగా మారింది. 44వ, 167వ నెంబర్లు గల రెండు జాతీయ రహదారులు ఉండటం, జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లో అంతర్జాతీయ స్థాయి ఫార్మా పరిశ్రమలు, మినీ ఇండియాగా మారడంతో జడ్చర్లలో రియల్ వ్యాపారానికి ఊతమిచ్చింది. పోలేపల్లి సెజ్‌లోని పరిశ్రమలతో పాటు టీఎస్ఐఐసీ ప్రాంగణంలో ఉన్న పరిశ్రమలలో విధులు నిర్వహించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది జడ్చర్లకు తరలివచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా నివాసం ఉండేందుకు కిరాయి ఇళ్లను ఆశ్రయించడంతో పట్టణంలో ఇళ్ల నిర్మాణం ఊపందుకున్నది. ఇలాంటి తరుణంలో రెండు, మూడేళ్లుగా రియల్ వ్యాపారం స్తబ్దుగా మారి మిన్నకుంది.

ఐదు సంవత్సరాలలో సగానికిపైగా తగ్గిన డాక్యుమెంట్‌లు

జడ్చర్ల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఐదు సంవత్సరాలలో సగానికిపైగా డాక్యుమెంటేషన్‌లు తగ్గిపోయాయి. భూముల రిజిస్ట్రేషన్‌లను తహసీల్ కార్యాలయంలో చేపడ్తుండటం, రియల్ ఎస్టేట్ వ్యాపారం స్తబ్దుగా మారడంతో ఈ పరిస్థితి నెలకొంది. 2019-20 వార్షిక సంవత్సరంలో 29,324 డాక్యుమెంట్‌లు కాగా, 2024-25 వార్షిక సంవత్సరంలో ఫిబ్రవరి వరకు దాదాపు 12వేల డాక్యుమెంట్‌లు మాత్రమే నమోదయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభించిన సందర్భంలో సైతం 2020-21 వార్షిక సంవత్సరంలో 14,150 డాక్యుమెంట్‌లు అయ్యాయి. 2021-22 సంవత్సరంలో 18,007 డాక్యుమెంట్‌లు, 2022-23 సంవత్సరంలో 17,055 డాక్యుమెంట్‌లు, 2023-24 సంవత్సరంలో 17,696 డాక్యుమెంట్‌లు నమోదయ్యాయి.


గత రెండు సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్‌లలో 25 నుంచి 30 శాతం డాక్యుమెంట్‌లు మాడిగేజ్ ఉంటాయని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెలిపారు.

స్తబ్దుగా రియల్

» ప్లాట్లపై పెట్టుబడులు - కొనేవారి కోసం ఎదురుచూపులు » కబ్జాలపాలవడం సైతం ఓ కారణం
» ప్లాట్లకు నేటి మార్కెట్‌లో పది సంవత్సరాల తర్వాత ఉండాల్సిన ధరలు



జడ్చర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పట్టణం విస్తరించడంతో పాటు నూతనంగా ఇళ్ల నిర్మాణాలు, అపార్ట్‌మెంట్ కల్చర్ వచ్చాయి. దీంతో పట్టణంలో ప్లాట్ల కొనుగోలుకు కొద్దో, గొప్పో ఆర్థిక స్థోమత ఉన్న వారంతా ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చి, పెట్టుబడులు పెట్టారు. కాగా, ప్రస్తుతం జడ్చర్లలో పరిస్థితి అంతా తారుమారయ్యింది. ప్లాట్లపై పెట్టుబడి పెట్టిన వారంతా ప్లాట్లను విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నా, కొనుగోలు దారులు కరువయ్యారు. వ్యాపారానికి అనువుగా ఉన్న ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న ప్లాట్లతో పాటు కొన్ని కాలనీలలో మాత్రమే కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. మిగతా ప్రాంతాల్లో ప్లాట్లను కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతా స్తబ్దుగా మారింది. జడ్చర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకున్న సందర్భంలో జడ్చర్ల నలుదిక్కులా కొందరు డీటీసీపీ లేఅవుట్‌తో, మరికొందరు కచ్చా లేఅవుట్‌లతో వెంచర్‌లను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన వెంచర్‌లలో కొనుగోలు చేసిన ప్లాట్లను రీ సేల్ చేసుకుంటే మరింత లాభం వస్తుందంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు విపరీత ప్రచారం చేయడంతో అత్యధికంగా ప్లాట్లను కొనుగోలు చేశారు. కాగా, కొనుగోలు చేసిన ప్లాట్లను విక్రయించేందుకు సిద్ధమైనా ప్రస్తుతం కొనుగోలు చేసే వారు లేక ఎంతో నష్టపోతున్నారు. హైదరాబాద్‌లో అమలు చేస్తున్న హైడ్రా... జడ్చర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారంపై దెబ్బపడిందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేర్కొంటున్నారు. కొనుగోలు చేసిన ప్లాట్లు హైడ్రాలో పోతాయన్న భయంతో సైతం ప్లాట్లను కొనుగోలు చేయడానికి ఇటీవల కాలంలో ముందుకు రాని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఎప్పుడో పది సంవత్సరాల అనంతరం రావలసిన రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపు అంతా, ఇన్‌స్టంట్‌గా రావడం కారణంగానే రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతా స్తబ్దుగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జడ్చర్ల మండలం మాచారం సమీపంలో ఏర్పాటు చేసిన కచ్చా లేఅవుట్

ఎల్‌ఆర్ఎస్ ఫీజువర్

● దరఖాస్తులను పరిశీలించిన అధికారులు ● భూముల విలువపై ఎల్‌ఆర్ఎస్ చార్జీ

కొత్తకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా వెలసిన లే అవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్ఎస్) ఫీజు భయపెడుతున్నదని ప్లాట్ల కొనుగోలుదారులు చర్చించుకుంటున్నారు. ఇళ్ల లేనివారు ఇల్లు కట్టుకోవడానికి రూ.లక్షలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇంటి నిర్మాణం ఎప్పుడు చేద్దాం.. ఎన్ని రూపాయలు అవుతుంది.. మన వద్ద ఎన్ని డబ్బులు ఉన్నవి.. తక్కువైతే ఎవరిని అడగాలి.. తెచ్చుకున్న అప్పు ఎలా తీర్చాలని ప్లాట్‌దారులు ఆలోచిస్తున్న తరుణంలో ఎల్‌ఆర్ఎస్ ప్రకటన గుదిబండగా మారింది.

పూర్తయిన దరఖాస్తుల పరిశీలన..

అక్రమ లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి గత ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్ఎస్ తీసుకొచ్చింది. అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వెయ్యి రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆ ఏడాది ఆగస్టులో ఆదేశించింది. ఆ ఆదేశాలతో జిల్లాలోని 5 మునిసిపాలిటీల్లో 47 వేల 971 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులపై మునిసిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిల్లో పర్యటించి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా దరఖాస్తులను పరిశీలించారు. ప్లాట్లు బఫర్, నాలా, చెరువులు, ప్రభుత్వ భూమి పరిధిలోకి రావాలని తేల్చి ప్రభుత్వం తయారు చేసిన మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

ప్లాటుదారుల గుస్సా..

గత ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ తీసుకొచ్చిన సమయంలో విపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక క్రమబద్ధీకరణను సవరిస్తామని చెప్పి ఇప్పుడెందుకు ఫీజు వసూలు చేస్తుందని ప్లాటు దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం టైం బాండ్ పెట్టకుండా 1990, 2010 దశకం కన్నా ముందే కొనుగోలు చేసిన ప్లాట్లకు ఎల్‌ఆర్ఎస్ పథకం ఎలా వర్తింపజేస్తారని చూసిందని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్‌పై పునరాలోచన చేసి ఓ టైం బాండ్ పెట్టి వాటికి మాత్రమే ఫీజులు వసూలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్లాట్ల విలువపై ఎల్‌ఆర్ఎస్ చార్జి..

అక్రమ లే అవుట్, ప్లాట్లు కొనుగోలు విలువపై ఎల్‌ఆర్ఎస్ చార్జి ఉంటుంది. ఈ చార్జీలను మూడు విభాగాలుగా విభజించారు. బేసిక్ రెగ్యులేషన్ చార్జీలుగా 100 స్క్వేర్‌మీటర్ల వరకు రూ. 200, 101 నుంచి 300 స్క్వేర్‌మీటర్ల వరకు రూ. 400, 301 నుంచి 500 స్క్వేర్‌మీటర్ల వరకు రూ. 600, 500 స్క్వేర్ మీటర్ల పైనా అయితే రూ. 750 నిర్ణయించారు. లే అవుట్ భూమి విలువపై 3వేల స్క్వేర్‌యాడ్ వరకు 25 శాతం, 5వేల స్క్వేర్‌యాడ్‌కు 50 శాతం, 10వేలు స్క్వేర్‌యాడ్‌కు 75 శాతం కేటాయించారు. మూడవది లేఅవుట్‌లో ఓపెన్‌స్థలాలకు 14 శాతం నిర్ణయించారు.

1990లో కొత్తకోటలో ప్లాట్లు కొన్నా..

నా ఇద్దరు పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్తకోటకు వచ్చిన. 1990లో ప్లాట్లు కొనుగోలు చేశా. అప్పుడు వెంచర్ చేసిన రియల్టర్లను అధికారులు ఏమి ప్రశ్నించకుండా 30 ఏళ్ల తర్వాత క్రమబద్ధీకరణ పేరుతో ఫీజు వసూలు చేయడం దారుణం.

- మురళీకృష్ణ, కొత్తకోట



ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తేనే అనుమతులు

ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లించిన ప్లాట్లకే ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తాం. అలాగే కట్టిన ఇళ్ల అమ్మకాలు నిర్వహించినా ఎల్‌ఆర్ఎస్ వర్తిస్తుంది. మార్చి నెలలో 11 మంది ద్వారా లక్షా 58 వేలు ఎల్‌ఆర్ఎస్ ఫీజు వసూలు చేశాం.

- సైదులు, కమిషనర్, కొత్తకోట మునిసిపాలిటీ



నష్టపరిహారం చెల్లించాలి

» కేఎల్ఐ కాల్వ పనులను అడ్డుకున్న రైతులు » రెండేళ్లుగా పరిహారం చెల్లించని ప్రభుత్వం


తాడూరు సమీపంలోని కేఎల్ఐ కాల్వ పనులను అడ్డుకున్న రైతులు

ఉప్పునుంతల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేఎల్ఐ కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం తాడూరు గ్రామానికి చెందిన రైతులు సుమారు 50 మంది గ్రామ శివారులోని కేఎల్ఐ కాల్వ పనులను అడ్డుకున్నారు. ఉప్పునుంతల మండలంలోని శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారికి తూర్పు గ్రామాల రైతులకు సాగునీరు అందించేందుకు గత రెండేళ్ల క్రితం నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా కేఎల్ఐ కాల్వ పనుల్లో తాడూరు గ్రామానికి చెందిన దాదాపు 50 మంది రైతులు భూములు కోల్పోయారు.

నష్టపరిహారం చెల్లించాలని రెండేళ్లుగా ప్రజా ప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే డొక్కాడని రైతు కూలీలకు రెండు సంవత్సరాల నుంచి అటు భూములు కోల్పోయి.. ఇటు నష్టపరిహారం లేక కుటుంబ జీవనం గడవడం కష్టంగా మారింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే కానీ జిల్లా అధికారులు కానీ స్పందించి భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించేలా చూడాలని కోరుతున్నారు.

● నష్టపరిహారం ఇస్తే కాల్వ పనులు చేయనిస్తాం



కాల్వ నిర్మాణానికి గాను మాది ఎకరా 14 గుంటల భూమి పోయింది. రెండేళ్లు అవుతున్నా నష్టపరిహారం రావడం లేదు. భూములకు నష్టపరిహారం ఇచ్చిన తరువాతనే కాల్వ పనులు చేయాలి.

- గుండమోని లింగమయ్య, రైతు, తాడూరు

● పుల్జాలలో ఇచ్చినట్టే మాకు రూ.10 లక్షలు ఇవ్వాలి



పుల్జాల గ్రామంలో కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఒక ఎకరాకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లిస్తున్నారు.. మాకు మాత్రం రూ.9లక్షల 30 వేలు ఇస్తామంటున్నారు. పుల్జాలలో ఇచ్చినట్టే మాకూ ఇవ్వాలి.

- వడ్డె రాజు, రైతు, తాడూరు

రాష్ట్రపతి భవన్‌లో గద్వాల చేనేత చీరల ప్రదర్శన


రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన గద్వాల జరీ చీరల స్టాల్

గద్వాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) అమృత్ కా మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సౌత్ ఇండియాలో ప్రసిద్ధి చెందిన హస్తకళలు, హ్యాండ్లూమ్, అథ్లెటిక్ సౌత్ ఇండియన్ ఫుడ్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉదయం పది గంటలకు ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ నుంచి 40స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో 25 స్టాల్స్ చేనేత రంగానికి సంబంధించినవి ఉన్నాయి. వీటిలో దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల చేనేత పట్టు చీరల స్టాల్స్ కూడా ఏర్పాటు చేశారు. 2023 కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు గ్రహీత అక్కల శాంతారామ్ ఆధ్వర్యంలో గద్వాల చేనేత జరీ చీరల ఉత్పత్తిదారుల సంఘం తరుపున స్టాల్స్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్నది. స్టాల్స్ నిర్వహిస్తున్న వారిలో చేనేత జరీ చీర ల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సురేష్ ఉన్నారు.

పెండింగ్ పాల బిల్లులు మంజూరు చేయించాలి

» ఎంపీ మల్లురవికి రైతుల వినతి


ఎంపీ మల్లురవికి వినతి పత్రం అందజేస్తున్న పాడి రైతులు

కల్వకుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న నాలుగు పాల బిల్లులను ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవికి పాడి రైతులు వినతి పత్రం అందజేశారు. బుధవారం ఎంపీని కల్వకుర్తి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయడంతో పాటు ప్రతీ 15 రోజులకొకసారి వచ్చే విధంగా చూడాలని రైతులు కోరారు. దీంతో స్పందించిన ఎంపీ మల్లురవి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ రాశారని పాడి రైతులు తెలిపారు.

వినతి పత్రం సమర్పించిన వారిలో రైతులు శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

» కారులో పెళ్లికి వెళ్తుండగా దుర్ఘటన

కొత్తకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కారులో పెళ్లికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని నాటవెల్లి గ్రామ శివారులో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతికి చెందిన రామయ్య (58) తన భార్య వసంత, కుమారుడు లోకేష్‌రాజులతో కలిసి హైదరాబాద్‌లో జరుగుతున్న బంధువుల పెళ్లికి కారులో బయలు దేరారు. నాటవెల్లి శివారులో వారి కారు ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొన్నది. దీంతో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న రామయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటోలో నుంచి కింద పడిన తండ్రీ కొడుకులు

» తీవ్రంగా గాయపడిన తండ్రి మృతి

రాజాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో వెళ్తున్న తండ్రీ కొడుకులు అదుపు తప్పి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన తండ్రిని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. రాజాపూర్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, నెక్కొండ గ్రామానికి చెందిన శ్రీనివాసులు (45) అనే వ్యక్తి రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామంలో నివసిస్తూ, పోలేపల్లి సెజ్‌లో పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం డ్యూటీకి వెళ్తూ, అలాగే తన కుమారుడు మణికంఠను పాఠశా లకు పంపించేందుకు ఆటోలో బయలుదేరారు. కుచ్చర్‌కల్ శివారులో తండ్రీ కొడుకులు ఇద్దరూ అదుపు తప్పి ఆటోలో నుంచి కింద పడ్డారు. తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడికి మూగదెబ్బలు తగిలాయి. వారిని తోటి ప్రయాణికులు 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆటోను డ్రైవర్ అజాగ్రత్తంగా నడపడం వల్లే తన భర్త మృతి చెందాడని, కుమారుడికి గాయపడ్డాడని భార్య శశికళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మద్దూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా, మద్దూరు మండల పరిధిలోని నాగంపల్లి వాగు నుంచి మంగళవారం అర్ధరాత్రి అనుమతి లేకుండా ఖాజీపూర్ గ్రామానికి ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించి గ్రామ శివారులో ట్రాక్టర్లను పట్టుకున్నారు. స్టేషన్‌కు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక అక్రమ డంపు సీజ్

తిమ్మాజిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండలంలోని బుద్ధసముద్రంలో ఏర్పాటు చేసిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. గ్రామంలో 25 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా నిల్వ చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ రామకృష్ణ, ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు బుధవారం డంపును పరిశీలించి, విచారణ జరిపారు. స్వాధీనం చేసుకొని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి తరలించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలించినా, డంప్ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కత్తులతో బెదిరించి నగదు, సెల్‌ఫోన్ చోరీ

అలంపూరు చౌరస్తా, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూరు చౌరస్తా సమీపంలో దారి దోపిడీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మానవపాడు మండలం, కొర్విపాడు గ్రామానికి చెందిన ఫిలెమాన్ అనే వ్యక్తి సోమవారం అలంపూరు చౌరస్తా నుంచి స్వగ్రామానికి వెళ్తూ, సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బహిర్భూమికి వెళ్లాడు. ముగ్గురు వ్యక్తులు స్కూటీపై అతడిని వెంబడించారు. కత్తులతో బెదిరించి అతడి దగ్గరున్న రూ.2500, సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లి పోయారు. సంఘటనపై బాధితుడు బుధవారం ఉండవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

గద్వాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకొని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని పరమాల గ్రామానికి చెందిన సుమతి కొంతకాలంగా తలనొప్పి, నరాల బలహీనతతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనపై భర్త నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బ్యాంకు ఖాతాలో నుంచి రూ. లక్ష స్వాహా

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలో నుంచి సైబర్ నేరగాళ్లు లక్ష రూపాయలు స్వాహా చేశారు. ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని అవురాసిపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య మెదక్ జిల్లా, సదాశివపేటలోని పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. అతడికి నాగర్‌కర్నూల్‌లోని ఎస్‌బీఐలో ఖాతా ఉంది. అయితే సైబర్ నేరగాళ్లు అతడి ఫోన్ నెంబర్‌ను వారి ఖాతాకు లింక్ చేసుకున్నారు. గత జనవరిలో తిరుపతయ్య స్నేహితులు సతీశ్ రూ. 26,740 వేలు, మధు 75 వేలు ఆన్‌లైన్లో పంపించారు. కానీ అవి తిరుపతయ్య ఖాతాలో జమ కాలేదు. ఈ విషయాన్ని తెలుసుకునేందుకు బుధవారం అతడు నాగర్‌కర్నూల్‌లోని బ్యాంకుకు వచ్చాడు. సిబ్బందితో మాట్లాడగా అతడి ఖాతా నుంచి జనవరి 16న రూ. 1,01,740 డ్రా అయినట్లు తెలిసింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

ఖిల్లాఘణపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన బాలస్వామి, భూత్పూర్ మండలం కరివెన గ్రామానికి చింతకాయల రాజు ఇటీవల డ్రెంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. పోలీసులు వారిని బుధవారం వనపర్తి జిల్లా కోర్టులో హాజరు పరిచారు. వారికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

చిరుతల దాడిలో గేదె దూడల మృతి

కోయిలకొండ/ మద్దూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చిరుత పులులు దాడి చేసి గేదె దూడలను చంపేశాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిలకొండ, నారాయణపేట జిల్లాలోని మద్దూరు మండలాల్లో ఈ సంఘటనలు జరిగాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోయిలకొండ మండలం అయ్యావారిపల్లి గ్రామానికి చెందిన రైతు రవీందర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం తన పొలంలోని పశువుల పాకలో గేదెలతో పాటు దూడలను కట్టేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి తర్వాత చిరుతలు పాకలోకి ప్రవేశించి రెండు దూడలను చంపి కొంతదూరం లాక్కెళ్లి కొంత మేర తిన్నాయి. బుధవారం ఉదయం రైతు పొలం దగ్గరకు వెళ్లి చూడగా దూడల కళేబరాలు కనిపించాయి. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో డిప్యూటీ రేంజ్ అధికారి రాజశేఖర్, బీట్ అధికారి ఉమేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, పంచనామ నిర్వహించారు. బాధిత రైతులకు పరిహారం అందిస్తామని తెలిపారు.

● నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని మోమినాపూర్ గ్రామానికి చెందిన రైతు గోళ్ల హన్మంతు మంగళవారం రాత్రి తన పొలంలో కొట్టంలో పశువులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా ఒక గేదె దూడ కనిపించలేదు. పరిసరాల్లో వెతకగా దూడ కళేబరం కనిపించింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు బుధవారం సాయంత్రం సంఘటన స్థలంలో బోను ఏర్పాటు చేశారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రణాళికతో చదివితే..
'పది'ంతల ఫలితం

» భయాన్ని వీడితే విజయం తథ్యం - పదవ తరగతి విద్యార్థులకు నిపుణుల సూచనలు - ఈ నెల 21 నుంచి పరీక్షలు ప్రారంభం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదు. ఒత్తిడికి గురవకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకొని పరీక్షలకు సిద్ధం కావాలి. అప్పుడే మంచి మార్కులు సాధించొచ్చు' అని విద్యావేత్తలు, నిపుణులు, సీనియర్ ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఈ నెల 21న నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఎలా చదువుకోవాలి, చదివిన అంశా లను ఎలా గుర్తుంచుకోవాలి, ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి తదితర అంశాలపై పలువురు సీనియర్ ఉపాధ్యాయులు, సబ్జెక్టు నిపుణులు, వైద్యులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించింది. వారి సూచనలు, సలహాలతో ప్రత్యేక కథనం..



పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

గణిత సూత్రాలపై పట్టుండాలి



గణితంలో నాలుగు సెక్షన్లు ఉంటాయి. వాటిలోని నిర్వచనాలు, సూత్రాలు, నిర్మాణాలను బాగా సాధన చేయాలి. సూత్రాలపై మంచి పట్టు ఉంటే ఎలాటి లెక్కలైనా సులువుగా చేసేయొచ్చు. అందుకోసం నిరంతరం సాధన చేస్తూ ఉండాలి. ఉపాధ్యాయులు సూచించిన ప్రధాన లెక్కలతో పాటు, త్రికోణమితి, రేఖాగణితం, శ్రేణులు, సంఖ్యాక శాస్త్రంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సమితులకు సంబంధించిన వెన్ చిత్రాలు, త్రికోణమితి పటాలను గీయడం నేర్చుకోవాలి. పార్ట్ 'బి'లో 20 మార్కులుంటాయి. గత ప్రశ్నపత్రాలను శ్రద్ధగా సాధన చేయాలి. ప్రణాళికతో చదువుకుంటే ఆశించిన మార్కులు సాధించవచ్చు.

- ఎండీ ఫసియొద్దీన్, గణిత ఉపాధ్యాయుడు

భౌతికశాస్త్రం బహు సులభం



భౌతిక శాస్త్రం పరీక్షలో మార్కులు సాధించడం బహుసులభం, ప్రయోగాల నుంచి తప్పని సరిగా ఒక వ్యాసరూప ప్రశ్న తప్పకుండా వస్తుంది. దర్పణాలు, కటకాలపై తప్పనిసరిగా ఒక ప్రశ్న వస్తుంది. వాటిని వివిధ స్థానాల్లో ఉంచినపుడు ఏర్పడే ప్రతిబింబ కిరణచిత్రాలు, లక్షణాలు, లోహాలు, అమ్ల, క్షారాల చర్యలు, కార్బొనేట్, బైకార్బొట్ చర్యలు, స్పటికీకరణం, హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి, నవీన ఆవర్తన పట్టిక, అయర్‌స్టెడ్, సోలినాయిడ్ ప్రయోగాలు, లోహక్షయం అధ్యాయనాల నుంచి ప్రశ్నలు ప్రధానంగా వస్తాయి. సమీకరణ తుల్యం చేయడం, అదే విధంగా లవణాలు, తయారీ, ఉపయోగాలు చూసుకోవాలి.

- సాయిబాబా, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, మహబూబ్‌నగర్

ఆంగ్లంలో గ్రామర్‌పై ప్రత్యేక దృష్టి



ఆంగ్ల ప్రశ్న పత్రం నాలుగు భాగాలుగా ఉంటుంది. సెక్షన్ - 'ఎ'లో రీడింగ్ కాంప్రహెన్షన్‌కు 24 మార్కులు, స్టడీ స్కిల్స్‌కు 8 మార్కులు, గ్రామర్‌కు 8, డిస్కోర్సెస్‌కు 20 మార్కులు ఉంటాయి. 1 నుంచి 8 ప్రశ్నలకు టెస్టుబుక్ నుంచి రెండు పాసేజెస్ అడుగుతారు. పాఠంలోని పాత్రల ఆధారంగా ప్రశ్నలు వస్తాయి. కొంచెం ఆలోచించి సమాధానాలు రాస్తే మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. సెక్షన్-'బి'లో నాలుగు భాగాలు, 20 మార్కులు ఉంటాయి. గ్రామర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. పాత ప్రశ్న పత్రాలను అధ్యయనం చేయాలి. పరీక్ష రాసేటప్పుడు కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.

- ఎం.మురళీకృష్ణ, జడ్పీహెచ్ఎస్, తిరుమలాపూర్

మ్యాప్ పాయింటింగ్, ప్రధాన అంశాలు



సాంఘిక శాస్త్రంలో బైకిబై మార్కులు సాధించాలంటే పరీక్షలో అక్షరాలు గుండ్రంగా, అర్థం అయ్యేలా ఉండాలి. ప్రశ్నలకు సుత్తి కొట్టకుండా సూటిగా, స్పష్టంగా జవాబులు రాయాలి. మ్యాప్ పాయింటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి, ఇండియా, తెలంగాణ మ్యాప్‌లలో భౌగోళిక అంశాలు, వనరులు, నదులు, సముద్రాలు, ముఖ్య పట్టణాలను గుర్తించడం సాధన చేయాలి. పట్టికలు, గ్రాఫ్‌లను శ్రద్ధగా అధ్యయనం చేయాలి. ఇచ్చిన పేరాను శ్రద్ధగా చదివి, ప్రశ్నలకు విపులంగా విపులంగా రాయాలి. బిట్ ప్రశ్నలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి, గత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.

- మోహన్‌రెడ్డి, సాంఘిక శాస్త్రం, జడ్పీహెచ్ఎస్, మిడ్జిల్

చక్కని రాతకు మంచి మార్కులు



తెలుగులో మార్కులు సాధించడం సులభం. జవాబులను తప్పులు లేకుండా, చక్కని దస్తూరితో రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు. ఉపాధ్యా యులు సూచించిన ప్రధాన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి, సాధన చేయాలి. వ్యాకరణం, చందస్సు, సందులు - సమాసాలపై ప్రత్యేక దృష్టి సాధించాలి. మొత్తం 80 మార్కులకు గాను, పార్ట్ -ఎ లో 60, పార్ట్ -బీలో 20 మార్కులు ఉంటాయి.

- గుముడాల చక్రవర్తి గౌడ్, తెలుగు, జడ్పీహెచ్ఎస్, అన్నాసాగర్

వ్యాస రచన, కవి పరిచయాలు కీలకం



హిందీ పరీక్షలో విద్యార్థులు చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకొంటే మంచి మార్కులు సాధించవచ్చు. వ్యాస రచన, కవి పరిచయాలు, వ్యాకరణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వ్యాసరచన ప్రశ్నలలో కరపత్రం, నినాదాలు, పోస్టర్, ఉత్తరం, విజ్ఞాపన, సంభాషణ తదితర అంశాలపై దృష్టి సాధించాలి. పార్ట్-'బి'లో భాషాకి బాత్, శబ్దబందార్ అంశాలను క్షుణ్ణంగా చదివితే మంచి మార్కులు వస్తాయి.

- రాకేశ్‌కుమార్, హిందీ ఉపాధ్యాయుడు

ఒత్తిడికి గురికావొద్దు



ఒత్తిడికి గురికుండా పరీక్షలు రాస్తేనే మంచి మార్కులు వస్తాయి. విద్యార్థులు మానసికంగా శారీరకంగా బలంగా ఉంటూ, సంతోషంగా, ఉల్లాసంగా పరీక్షలకు సిద్ధం కావాలి. కఠినం అనుకున్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పరీక్షలకు బాగా సిద్ధం అయిన విద్యార్థులు కూడా హాల్‌కు వెళ్లిన సమయంలో ఒత్తిడికి గురికావడం సహజం. అది ఐదు నిమిషాలే ఉంటుంది. ఆ తర్వాత ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలి. పరీక్షల సమయంలో లిక్విడ్ ఫుడ్ తీసుకోవడం మంచిది. ఎక్కువ మొత్తంలో నీరు, మజ్జిగ లాంటి ఆహారం తీసుకోవాలి. సమతుల ఆహారం తప్పనిసరి. మాంసాహారానికి దూరంగా ఉండటం మంచిది.

- డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

సమతుల ఆహారం ఇవ్వాలి



విద్యార్థులకు పరీక్ష సమయంలో మాంసం, చల్లని పదార్థాలు ఇవ్వకూడదు. సమతుల ఆహా రం అందించాలి. పరీ క్షల సమయంలో విద్యార్థుల తల్లి దండ్రుల పాత్ర ఎంతో ముఖ్యం. వారిని అన్ని విధాలా ప్రోత్సహించాలి. వారిని మందలించొద్దు, చదువు, చదువు అంటూ ఒత్తిడి పెంచకూడదు. టీవీ, సెల్‌ఫోన్లకు అవసరమైన మేర దూరంగా ఉండాలి . వాటి ప్రభావం పిల్లలపై పడకుండా చూడాలి. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి బోజనంలో సమతుల ఆహారం మాత్రమే ఇవ్వాలి.

- డాక్టర్ సూర్యప్రకాష్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, హైదరాబాద్

పరికల్పన, ప్రయోగాలే ప్రధానం



గతంలో భౌతిక, రసాయన, జీవశాస్త్రం పరీక్షలు ఒకే రోజు ఉండేవి. గత ఏడాది నుంచి పద్ధతి మారడంతో జీవశాస్త్రం పరీక్షను సులువా రాసేందుకు అవకాశం ఉంది. మొత్తం 40 మార్కుల పేపర్ ఉంటుంది. ఇందు లో పార్టు- 'ఎ'లో 30, పార్టు-'బీ'లో 10 మార్కు లు ఉంటాయి. పరికల్పన, ప్రయోగం, నిజజీవిత వినియోగం అంశాలపై దృష్టి పెట్టాలి. ప్రయోగాన్ని వివరించడం, బొమ్మలు గీయడం, విషయ అవగాహన ఉండాలి. పార్ట్-'బీ'లో బిట్ ప్రశ్నలకు అవగాహనతో సరైన సమాధానం రాయాలి.

- సింగరాజు రాములు, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు

హత్య కేసులో నిందితుడి అరెస్టు

» ఇద్దరి మధ్య జరిగిన చిన్న గొడవే కారణం » మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలో గత నెల 24న అర్ధరాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన చిన్న గొడవ హత్యకు దారి తీసిందని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రం, రోటస్ జిల్లాలోని రాంపూర్ బరేతా గ్రామానికి చెందిన రషీద్‌ఖాన్(26) నాలుగు నెలలుగా జడ్చర్ల మండలంలోని విర్కో పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తోటి కార్మికులతో కలిసి బీఆర్ రెడ్డి ఫంక్షన్‌హల్‌లోని మొదటి అంతస్తులోని గదుల్లో నివాసం ఉంటున్నారు. వీర్కో కంపెనీలో క్రేన్ మరమ్మతు కోసం ఆ కంపెనీ ప్రతినిధి ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం, గోరఖ్‌పూర్ జిల్లా, చౌరీచౌరీ మహదేవా అదాయ్ గ్రామానికి చెందిన వినయ్ అనే వ్యక్తిని జడ్చర్లకు పంపించారు. గత నెల 23న జడ్చర్లకు వచ్చిన ఆయన బీఆర్ రెడ్డి ఫంక్షన్‌హల్ మొదటి అంతస్తులోనే ఉంటూ పరిశ్రమకు వెళ్లి క్రేన్‌కు మరమ్మతు చేశాడు. పని పూర్తి కావడంతో 25న ఉదయం ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అందుకు కొంత సమయం ఉండటంతో 24న రాత్రి 12:30 గంటల సమయంలో ఫంక్షన్‌హల్ మెట్లపై కూర్చుని ఫోన్‌లో పబ్ జీ గేమ్ ఆడుకుంటున్నాడు. అదే సమయంలో మద్యం తాగి వచ్చిన రషీద్‌ఖాన్ తన గదికి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతూ దారిలో కూర్చున్న వినయ్‌తో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటా, మాటా పెరిగింది. అలాగే ఘర్షణ పడుతూనే మొదటి అంతస్తుకు చేరుకున్నారు. వినయ్ బలంగా తోయడంతో రషీద్‌ఖాన్‌ను తలకు తీవ్ర గాయమై కిందపడిపోయాడు. అతడి మెడకు జీన్స్‌ప్యాంట్ చుట్టి చంపేశాడు. ఆ తర్వాత మృతదేహాన్ని గదిలోని బాత్‌రూమ్‌లోకి లాక్కెళ్లి పడేసి, అతడి దగ్గరున్న సెల్‌ఫోన్‌ను తీసుకుని పరారయ్యాడు. సంఘటనపై విర్కో కంపెనీ లేబర్ సూపర్ వైజర్ రమాకాంత్ స్వయన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జడ్చర్ల సీఐ కమలాకర్ ఆదేశం మేరకు, ఎస్‌ఐ మల్లేశ్ విచారణ చేపట్టారు. నిందితుడు బుధవారం హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ మల్లేశ్, కానిస్టేబుల్ నరసింహతో కలిసి వెంటనే అక్కడికి వెళ్లి అతడిని అరెస్ట్ చేసి, అతడి వద్దనున్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జడ్చర్లకు తీసుకొచ్చి, కోర్టులో పరిచి, రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో సీఐ కమలాకర్, ఎస్‌ఐ మల్లేశ్, జయప్రసాద్, చంద్రమోహన్ ఉన్నారు.

హోరాహోరీగా పశుబల ప్రదర్శన

» ముఖ్య అతిథిగా హాజరైన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

» రాజోలిలో కొనసాగుతున్న రైతు సంబురాలు



ఎద్దుల బలప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

రాజోలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రంలో భ్రమరాంబికా ఆదివేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నా యి. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న రైతు సంబురాల్లో భాగంగా బుధవారం అంతర్రాష్ట్ర పాలపళ్ల విభాగంలో పశువుల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, జయరెడ్డిలతో కలిసి పోటీలను ప్రారంభించారు. మొత్తం 12 జతల ఎద్దులు పాల్గొనగా, రామచంద్రారెడ్డికి చెందిన ఎద్దులు బండను 5 వేల అడుగులు లాగి ప్రథ మ స్థానంలో నిలిచాయి. ఆయనకు ఎమ్మెల్యే విజయుడు రూ. 50 వేలు బహూకరిం చారు. సాతర్లకు చెందిన అర్షద్‌బాషా, అబ్దుల్ బాషాలకు చెందిన ఎద్దులు 4,767 అడుగులు లాగి రెండవ స్థానాన్ని సొంతం చేసుకున్నాయి. మాజీ సర్పంచు శ్రీరామ్‌రెడ్డి జ్ఞాపకార్థం చల్లాయూత్ సర్వేశ్వర్‌రెడ్డి, ఉల్లి గడ్డల శ్యాలు, గోవర్ధన్ రెడ్డి, అశోక్ రెడ్డిలు కలిసి రూ. 40 వేలు బహూ కరించారు. రాయవరం గ్రామానికి చెందిన రామచంద్రా రెడ్డి ఎద్దులు 4,750 అడుగులు లాగి మూడవ స్థానం దక్కించుకున్నాయి. విజేతకు రాజోలి మాజీ సర్పంచు వెంకటేశ్వరమ్మ, గోపాల్ రూ. 30 వేలు బహూకరించారు. నంద్యాలకు చెందిన గుండం చిన్నారెడ్డి ఎద్దులు నాలుగవ స్థానం, కొణిదెలకు చెందిన దండు వెంకటేశ్వర్లుకు చెందిన ఎద్దులు ఐదవ స్థానాలను దక్కించుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నిర్వహకులు నాగేశ్వర్‌రావు, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పాలమూరు జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి

» జిల్లా క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్

» వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం



వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్, వాలీబాల్ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ, కబడ్డీ సంఘం జిల్లా సెక్రటరీ కురుమూర్తి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రీడాభివృద్ధికి జిల్లా క్రీడాశాఖ చర్యలు తీసుకుంటోందని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియం ఆవరణలో ఒక గదిని వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ కేంద్రానికి కేటాయించారు. ఆ కేంద్రాన్ని బుధవారం వాలీబాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కురుమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు ఇటీవల జరిగిన సీఎం కప్‌లో వెయిట్ లిఫ్టింగ్‌లో రెండు పతకాలు సాధించారని తెలిపారు. జిల్లా లేబర్ కమిషనర్ చంద్రశేఖర్ విజ్ఞప్తి మేరకు శిక్షణ కేంద్రానికి గది కేటాయించినట్లు తెలిపారు. ప్రత్యేక శిక్షకుడిని నియమించి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇప్పటికే బాక్సింగ్ శిక్షణకు స్థలం కేటాయించినట్లు తెలిపారు. భవిష్యత్తులో స్టేడియంలో మరిన్ని శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, అథ్లెటిక్ కోచ్ సునీల్‌కుమార్, వాలీబాల్ కోచ్ పర్వేజ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉమేష్‌కుమార్ పాల్గొన్నారు.

అర్చకుడితో పాటు ఈవోపై
సుమోటో కేసు

» వచ్చే నెల 4లోపు చర్యలు తీసుకోవాలని ఆదేశం

అలంపూరు చౌరస్తా, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరులోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అవినీతి ఆరోపణలపై హైదరాబాదు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయ నిధుల దుర్వినియోగంపై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు దేవాదాయ శాఖపై కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏప్రిల్ 4లోపు పూర్తి స్థాయి విచారణ జరిపి ఏమి చర్యలు తీసుకున్నారో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఆలయ ఈవోగా పనిచేస్తున్న పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ ఆలయ నిధులు, భక్తుల కానుకలు తదితర వాటిలో తలదూర్చి అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తరుణంలో హైదరాబాదు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆగ్రహం వ్యక్తం చేయడం స్థానికంగా మరింత ప్రకంపనలు సృష్టించింది.

న్యూస్ బాక్స్

కాంగ్రెస్ నాయకుడికి మాతృ వియోగం


లక్ష్మమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరి నారాయణగౌడ్ తల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. మండలంలోని జంగంపల్లి గ్రామంలో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆ గ్రామానికి వచ్చి లక్ష్మమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు నాసరయ్య, కుందా మల్లికార్జున్, శ్రీనివాసులు, బుచ్చయ్య, రహీం, వెంక టేశ్వర్లు, శివాజీ, బాల్‌లింగంగౌడ్, తిరుమలయ్య తదితరులున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మండలంలోని మొలకమామిడి గ్రామ అభివృ ద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా వేసిన బోరుమోటారును, అచ్చంపేట-మద్దిమడుగు ప్రధాన రహదారి పక్కన నూతనంగా నిర్మిస్తున్న బస్‌షెల్టర్ పనులను బుధవారం ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో వీడీసీ కమిటీ అధ్యక్షుడు జనార్ధన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువజన సంఘం నాయకుడికి ఘన సన్మానం


శివకుమార్‌ను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

కల్వకుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ జాతీయ యువజన అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో రజక సంఘం నాయకులు జాతీయ యువజన అవార్డుకు ఎంపికైన శివకుమార్‌ను రజక సంఘం నాయకులు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివకుమార్ చేసిన సేవలను రజక సంఘం నాయకులు కొనియాడారు. సన్మానించిన వారిలో రజక సంఘం నాయకులు మొగిలి జంగయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

జూపల్లి మాజీ సర్పంచ్ మృతి


వాసుదేవ్‌రావు (ఫైల్)

చారకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రంగినేని వాసుదేవ్‌రావు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన జూపల్లి గ్రామానికి 1975 నుంచి 1989 వరకు సర్పంచ్‌గా గ్రామ ప్రజలకు సేవలు అందించారు. ఆయన అంత్యక్రియలు గురువారం జూపల్లిలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మైనార్టీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కల్వకుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనార్టీ సర్వీస్ అసోసి యేషన్ నూతన క్యాలెండర్‌ను తహసీల్దార్ ఇబ్రహీం ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించా రు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో నాయకులు ప్రసన్న కుమార్, ఖాదర్, మన్సూర్, ఫిరోజ్, రహీం, షబ్బీర్, ఫజల్, సయ్యద్‌కుర్షీద్‌ఆలీ, ఖాదర్, సుబాన్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు చేపట్టాలి


నర్సంపల్లిలో ఇందిరమ్మ గృహాలకు ముగ్గు వేస్తున్న ఎంపీడీవో కృష్ణయ్య తదితరులు

ఊర్కొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన నర్సంపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. బుధవారం నర్సంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులతో కలిసి ముగ్గు పోశారు. గృహనిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు దశల వారీగా డబ్బులు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. మంజూరైన వారు ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. విడతల వారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్ నాయక్, ఏపీవో నర్సింహ్మా, పంచాయతీ కార్యదర్శి మంజుల, నాయకులు వెంకట్‌రెడ్డి, గోపాల్ శ్రీశైలం, నిరంజన్ ఉన్నారు.

రాయలగండిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- లక్ష్మీచెన్నకేశవ స్వామికి భక్తుల పూజలు

పదర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయలగండి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో రెండవ రోజైన బుధవారం బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆలయ అర్చకులు దాశరథి మోహన్, ఆలయ చైర్మన్ ఇమ్మడి నరహరి, భక్తజనం సమక్షంలో ఉదయం మూలవిరాట్‌కు మహా కుంబాభిషేకం, పంచముఖ మంగళహారతి, తీర్థ ప్రసాదాల వితరణ నిర్వహించారు. రాయలవారి సన్నిధికి అమ్రాబాద్, పదర మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఆలట పోటీలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం చేపట్టా రు. రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలో జానపద కళాకారులచే కోలాటం, చిటుకుల భజ న, అడుగుల భజన, వేషాలతో వివిధ పురాణ పాత్రలను వర్ణిస్తూ నాటకాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విష్ణుసహస్రస్తోత్ర పారాయణం

గర్భగుడిలో ప్రాతఃకాలపు పూజలు నిర్వహించిన తరువాయి జై శ్రీమన్నారాయణ ఆధ్యాత్మికతలో భాగంగా అచ్చంపేట వికాస తరంగిణి శాఖ ప్రతినిధులు పాపిశెట్టి అశోక్ కుమార్, పుల్లమ్మ, జయమ్మ, శ్యామలమ్మ ఆధ్వర్యంలో విష్ణుసహస్ర స్తోత్ర పారాయణం భక్తులకు వివరించారు. ఆలయ ఆధ్మాత్మిక ఇన్‌చార్జి విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్బదాస్, అమ్రాబాద్ మండలంలోని కల్లోంపల్లి గ్రామ గురుభక్త బృందం సభ్యులు నారమొల్ల నిరంజన్, లక్ష్మమ్మ, కల్మూల మార్కండేయ్య తదితరులు ఉన్నారు.


వికాస తరంగిణి ఆధ్వర్యంలో విష్ణుసహస్ర స్తోత్ర పారాయణం

శివాలయం పునర్నిర్మాణం కోసం భూమి పూజ

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని మరికల్ గ్రామంలో శివాలయ గుడి దగ్గర నూతనంగా శివాలయం పునర్నిర్మాణం కోసం బుధవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అయితే గ్రామ హిందూ బంధుమిత్రులు, శివాలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొని శివాలయ పునర్నిర్మాణం గురించి చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ఇప్పుడున్న శివలింగాన్ని అదే గుడిలో వేరే చోటకు మార్చడానికి భూమి పూజ చేశారు. కార్యక్రమం నిర్వహణ కోసం కాకం రమేష్ రూ.7400 నగదు అర్చకులకు అందజేశారు. ఆలయ పనులు సజావుగా జరగాలని కోరారు.


శివాలయం పునర్నిర్మాణం కోసం జరుగుతున్న భూమి పూజ

తెగుళ్లను తొలిదశలోనే నివారించాలి

- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శైల

బిజినేపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వివిధ పంటలకు ఆశించిన తెగుళ్లను తొలిదశలోనే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శైల రైతులకు సూచించారు. మండలంలోని ఖానాపూర్‌లో బుధవారం యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంటలను క్షేత్ర పరిశీలన చేసి ఎక్కువగా ఎండు తెగులు ఆశించినట్లు గుర్తించి నివారణ చర్యలు సూచించారు. ఎక్కువగా మొక్కజొన్న పంటకంకి ఏర్పడే దశలో ఉందన్నారు. పంటకు అవసరానికి మించి నీటి తడులు ఇవ్వడం ద్వారా ఎండు తెగులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రైతులకు అవగాహన కల్పించారు. ఎండు తెగులు నివారణకు వాడాల్సిన మందులను రైతులకు వివరించారు. వివిధ పంటల్లో ఆశించిన తెగుళ్ల నివారణకు తీసుకో వాల్సిన జాగ్రత్తలను, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఆమె వెంట సేద్యపు విభాగం శాస్త్రవేత్త రామకృష్ణ ఉన్నారు.


ఖానాపూర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఎస్సీ-బీ హాస్టల్‌లో విద్యార్థులచే వెట్టిచాకిరీ

కల్వకుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ఎస్సీ-బీ హాస్టల్లో విద్యార్థులచే వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. చదువుకోవాల్సిన విద్యార్థులు కూరగాయలు కోయడం వంటి పనులు చేస్తూ అవస్థలు పడుతున్నారు. వసతి గృహంలో పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది విధులను విస్మరిస్తున్నారు. దీంతో విద్యార్థులే పని మనుషులుగా అవతారమెత్తుతున్నారు. విద్యార్థులకు వంట చేయడానికి ముగ్గురు సిబ్బందికిగాను బుధవారం సాయంత్రం ఒక్కరే విధుల్లో ఉన్నారు. మిగతా ఇద్దరు రాలేదు. దీంతో హాస్టల్లోని కొంతమంది చిన్నారి విద్యార్థులు కూరగాయలు కోయడం, వంట పనులకు సహాయకులుగా పనులు చేశారు. చదువుకోవాల్సిన విద్యార్థులు పనులు చేస్తుండగా పనులు చేయాల్సిన సిబ్బంది బయట తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలువురు విద్యార్థులు బహిరంగంగానే ఆరోపిం చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎస్సీ-బీ వసతి గృహంలో విద్యార్థులచే వెట్టిచాకిరీ చేయించకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఏఎస్‌డబ్ల్యూవో శ్రీకర్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పిల్లలతో పని చేయించడం తప్పని, విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. సిబ్బంది ఎందుకు రాలేదో విచారిస్తానని తెలిపారు.

ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పించాలి

- ఎంపీడీవో ఇసాక్ హుసేన్

చారకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం పనులపై గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఇసాక్ హుసేన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ప్రారంభించి కూలీలు అధికంగా వచ్చేవిధంగా అవగాహన కల్పించాలని అన్నారు. నర్సరీల్లో షేడ్ నెట్లు ఏర్పాటు చేసి మొక్కలు చనిపోకుండా ప్రతీరోజు నీరు పోయాలని అన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వంద శాతం ఇంటిపన్ను వసులు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేష్, ఏపీవో లక్ష్మయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ రవి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇసాక్ హుసేన్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కల్మోట గిరికుమార్

కల్వకుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని నాగర్‌కర్నూల్ జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కల్మోట గిరికుమార్ అన్నారు. సైబర్ జాగృతికా దివస్ ప్రోగ్రాంలో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహంలో సైబర్‌నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కల్మోట గిరికుమార్ మాట్లాడుతూ అధిక డబ్బు కోసం ఆశపడి ఆన్‌లైన్ మోసాలకు గురి కావద్దని సూచించారు. ఎక్కడైనా అపరిచితులు వాట్సాప్‌లో, మనీ యాప్‌లలో పెట్టుబడులు పెట్టాలని కోరితే వెంటనే పోలీసులకు సమాచారమందించాలని ఆయన కోరారు. కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.


మాట్లాడుతున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ గిరికుమార్

ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమి పంపిణీ చేయాలి

పెంట్లవెల్లి/ వంగూరు/ కొల్లాపూర్/ కల్వకుర్తి/ అచ్చంపేటటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జటప్రోలులో ప్రభుత్వ భూమిని పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో 700 మంది నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. సర్వే నెంబర్ 177లో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేయాలని కోరారు. నాయకులు హనుమంతు, గోపాల్, మల్లేష్, సలీం పాల్గొన్నారు.

● వంగూరు మండలంలోని మాచినోనిపల్లి గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి బండపల్లి బాలస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి హామీ పనులపై సర్వే నిర్వహించారు. గ్రామా ల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనుల గురించి రైతు కూలీలను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు ఉపాధిహామీ పనులు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లతో పాటు తదితర పథకాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వంపై ప్రజలపక్షాన పోరాడుతామని బాలస్వా మి అన్నారు. కార్యక్రమంలో గుమ్మకొండ రాజయ్య, రామస్వామి, నిరంజన్, పర్వత్‌రెడ్డి, రామారెడ్డి, శ్రీరంగారెడ్డి, పెంటయ్యపాల్గొన్నారు.

సైడ్ కాలువల నిర్మాణం చేపట్టాలి

కొల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయం ముందున్న మురుగు కాలువను తక్షణమే అండర్ డ్రైనేజీ నిర్మాణం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం బృందం 16వ వార్డులో పలు సమస్యలపై సర్వే చేసి ప్రధాన సమస్యగా ఉన్న కాలువను పరిశీలించారు. సైడ్ కాలువలు మురుగు కంపు కొడుతూ కాలనీవాసులు పక్కనే ఉన్న ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ సలీం, బత్తిని రాజు, సాయి కుమార్, రాముడు పాల్గొన్నారు.

రేపు పంచాయతీ కార్మికుల ఆందోళన

పెద్దకొత్తపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీలలో పని చేసే పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7వ తేదీన పెద్దకొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నామని పారిశుధ్య కార్మిక సంఘం మండల నాయకులు ఇంద్రకంటి బాలస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సిబ్బందికి ఇచ్చి హామీల అమలు, వేతనాలు సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు. బకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని కోరారు.

ఆధార్ అప్‌డేట్ సెంటర్ ప్రారంభం

పెద్దకొత్తపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఆధార్ అప్‌డేషన్ సెంటర్‌ను మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. మండలంలోని అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వేరుశనగ పొట్టు దగ్ధం

పెద్దకొత్తపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన రైతు జంపయ్య తన పశువుల మేత కోసం దొడ్డిలో నిల్వ ఉంచిన ఐదు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు బుధవారం రాత్రి దగ్ధమైంది. పెద్దకొత్తపల్లి సమీపంలో జయశంకర్ విగ్రహం సమీపంలో ఉన్న పశువుల దొడ్డిలో ఉన్న ఐదు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా బూడిదైంది. సుమారు లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతు జంపయ్య తెలిపారు.

పట్టుబడిన వాహనాల వేలం

కొల్లాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం ఆ శాఖ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఉదయం 11 గంటలకు కొల్లాపూర్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన 12 ద్విచక్ర వాహనాలను జిల్లా ఎక్సైజ్ అధికారి గాయత్రి సమక్షంలో వేలం నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ వేలంలో 12 వాహనాలకు ప్రభుత్వం వారు రూ.1,19,500 నిర్వహించారు. వేలం పాట ద్వారా రూ.1,88,000 (57 శాతం అదనం) వచ్చాయని, జీఎస్‌టీ 31,928 రూపాయలు వచ్చిందని ఆయన తెలిపారు.

చేవేళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి : కేవీపీఎస్


మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు

కల్వకుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా చేవేళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలుపర్చాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ డివిజన్ స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, కేవీపీఎస్ నాయకులు చంద్రయ్య, డేవిడ్, ప్రజా నాట్య మండలి కార్యదర్శి ఉన్నారు.

నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి : డీవైఎఫ్ఐ

అచ్చంపేటటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతి యువకులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వర్థం సైదులు అన్నారు. డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదును బుధవారం పట్టణంలో ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాం డ్ చేశారు. జిల్లాలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ నాయకులు కురుమూర్తి, సాయిరంజిత్, అరవింద్, చందు పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ అమరేందర్
- పదో తరగతి వార్షిక పరీక్షలపై సమీక్షా సమావేశం


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అమరేందర్

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలు మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో పదో తరగతి వార్షిక పరీక్షలపై జిల్లా విద్యాధికారితో కలిసి అదనపు కలెక్టర్ అమరేందర్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. గతేఏడాది వార్షిక పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా 21వ స్థానంలో ఉందని, ఈసారి కనీసం 10వ స్థానం లోపు సంపాదించుకునేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను కోరారు. పరీక్ష ప్రశ్నాపత్రాలను పోలీసు స్టేషన్ నుంచి సరఫరా చేస్తారని, నిర్ణీత సమయంలో సీసీ కెమెరా ముందు వాటిని ఓపెన్ చేసి విద్యార్థులకు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్ష ముగిసిన వెంటనే ప్యాకింగ్ చేసిన జవాబు పత్రాలను పోస్టాఫీసు ద్వారా పంపించాల్సి ఉంటుందన్నారు. జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ పరీక్ష విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, విద్యాశాఖ జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


కల్వకుర్తి : ఇంటర్ పరీక్షకు హాజరైన విద్యార్థినులు

కల్వకుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన ఏడు పరీక్ష కేంద్రాల్లో 1672 మందికి గాను 60 మంది గైర్హాజరు కాగా 1612 మంది పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాంరెడ్డి తెలిపారు.

● తిమ్మాజిపేట : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు తిమ్మాజిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ అనసూయ మాట్లాడుతూ కళాశాలలో మొదటి సంవత్సరంలో చదివే 104మంది విద్యార్థులకు గాను 101మంది పరీక్షలు రాశారని, ముగ్గురు గైర్హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు.

ఐక్యంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శులు మణికంఠ, రాజు


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

కల్వకుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బీసీలు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శులు మణికంఠ, రాజు నేత అన్నారు. కల్వకుర్తి పట్ట ణంలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు కావస్తున్నా తెలంగాణ, ఏపీలలో రెండు కులాలే పరిపాలన సాగిస్తున్నాయని పేర్కొన్నారు. మిగిలిన కులాల వారు రాజకీయ నాయకుల పల్లకిలు మోయడానికే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 77ఏళ్ల స్వాతంత్ర్యంలో బీసీలు అన్ని రకాలుగా వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని వారు డిమాండ్ చేశారు. సమగ్ర సర్వేలో బీసీ కులాల లెక్కలు తక్కువగా చూపించి వారిని గందరగోళాన్ని సృష్టిస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలందరూ తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, నాయకులు భాస్కర్, రాము, వెంకటయ్య, బీసీ సబ్‌ప్లాన్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు ఉన్నారు.

కాలనీలో కొనసాగుతున్న పైపులైన్ పనులు

కొల్లాపూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా మిషన్ భగీరథ పైపులు ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మహముదా బేగం పేర్కొన్నారు. బుధవారం 5వ వార్డులో కొనసాగుతున్న నూతన మిషన్ భగీరథ పైపులైన్ పనులను ఆమె పరిశీలించారు. కొల్లాపూర్ పట్టణంలోని 5వ వార్డులో మెకానిక్ రుక్కు ఇంటి నుంచి మేస్త్రీ రాజు ఇంటి వరకు మంచి నీటి పైపులైన్ కనెక్షన్ లేక తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి ఆమె తీసుకువెళ్లగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



తాడూరు : పర్వతాయిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తాడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండల పరిధిలోని పర్వతాయిపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా పి.సుశాంత్, ఎంఈవోగా పి.నేహ మరో పది మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కగా బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ.చంద్రయ్య, ఉపాధ్యాయులు ఆనంద్, రాజు, అంగన్‌వాడీ టీచర్ మణెమ్మ, మాణిక్య మ్మ, సిబ్బంది సుజాత పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట : మండల పరిధిలోని మరికల్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 31మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కగా బోధించి చూపరులను ఆకట్టుకున్నారు. పాఠశాల హెచ్‌ఎంగా శరత్, ఎంఈవోగా ప్రవంత్, డీఈవోగా మల్లీశ్వరి వ్యవహరిం చారు. మండల విద్యాశాఖ అధికారి సత్యనారా యణశెట్టి పర్యవేక్షించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై చక్కగా బోధించిన వారికి బహుమతులను అందజేశారు. హెచ్ఎం.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాజిపేట : ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఎంఈవో సత్యనారాయణశెట్టి, ఉపాధ్యాయులు